క్లుప్తంగా

ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రాఘవేంద్ర, అబ్దుల్లా

కర్నూలు(సెంట్రల్): అనారోగ్యంతో వెళ్లిన వారి ప్రాణాలు తీస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా డిమాండ్ చేశారు. బుధవారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు డబ్బే ధ్యేయంగా పని చేస్తున్నాయన్నారు. ప్రజల ప్రాణాలంటే లెక్క లేకుండా వైద్యం చేస్తుండడంతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. ఇటీవల కర్నూలులోని నోబుల్ ఆసుపత్రికి కాన్పు కోసం వెళ్లిన గర్భిణి వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయిందన్నారు. తక్షణమే ఆ ఆసుపత్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖాధికారులు ప్రైవేట్ ఆసుపత్రులను తరచూ తనిఖీలు చేసి లోపాలపై చర్యలు తీసుకోవాలన్నారు. సహాయ కార్యదర్శి ప్రకాష్, నాయకులు మధు, శ్రీనివాసులు , హరికిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఏఐఎస్‌ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఆ సంఘం నాయకులు రక్తదానం చేశారు. సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆ సంఘం జాతీయ కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్ జీ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. యువకులు, విద్యార్థులు, మహిళలు సమాజ హితం కోసం పాటుపడాలన్నారు. ఆపద సమయాల్లో రక్తం అవసరమైన వారికి రక్తదానం చేసేందుకు వెనుకడుగు వేయరాదన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సోమన్న, షాబీర్‌బాషా, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి భారతి పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆగస్టు 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలు జరిగే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలకు వేదికవుతున్న ఒంగోలులో జరిగే సభలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లాలని కోరారు. ఈ సమావేశాల్లో రాష్ట్రంలోని ప్రధాన సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. సహాయ కార్యదర్శులు ఎన్.లెనిన్‌బాబు, ఎస్.మునెప్ప, నాయకులు కె.జగన్నాథం, పి.రామకృష్ణారెడ్డి, జి.చంద్రశేఖర్, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ


ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థులు బుధవారం ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. దేశవ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీల్లో యాంటీ ర్యాగింగ్‌పై ప్రతిజ్ఞ చేయాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఎన్‌ఎంసీలు ఆదేశించాయి. ఈ మేరకు జూమ్ మీటింగ్ ద్వారా ఎన్‌ఎంసీ చైర్మన్ డాక్టర్ అభిజిత్ సేథ్ అన్ని మెడికల్ కాలేజీల విద్యార్థులచే ర్యాగింగ్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలు, ర్యాగింగ్ చట్టం గురించి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, హెచ్‌ఓడీలు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

కర్నూలు (టౌన్): రక్తదానం ప్రాణదానంతో సమానమని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష అన్నారు. బుధవారం బిర్లా కాంపౌండ్‌లోని కార్యాలయ ఆవరణలో తలసేమియా వ్యాధిగ్రస్తులకు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం మానవత్వ ధర్మమన్నారు. యువత అపోహలు వీడి రక్తదానం చేయాలన్నారు. రక్తదానంతో ప్రాణదాతలుగా సమాజంలో ఆదర్శంగా నిలవాలన్నారు. రెండవ పట్టణ సీఐ నాగరాజు మాట్లాడుతూ.. సామాజిక సేవ కార్యక్రమాల్లో యువత ముందుండాలన్నారు. కార్యక్రమంలో కేపీయస్ సభ్యులు హరినాథ్ గౌడ్, శ్రీనివాసులు, మధు, రాఘవేంద్ర, నాగరాజు, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో అధిక వర్షాలు కురుస్తుండటంతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆదోని సబ్ కలెక్టర్, ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రెండు, మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో రిజర్వాయర్లు, చెరువులు, లోతట్టు ప్రాంతాలు, పాత బ్రిడ్జిలను పరిశీలించాలని ఆదేశించారు. అవసరమైన చోట ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సుంకేసుల, గాజులదిన్నె, పందికోన రిజర్వాయర్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలని సబ్‌కలెక్టర్, ఆర్‌డీఓలను ఆదేశించారు. అలాగే నదీ తీర ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న చోట మోటార్లతో తొలగించాలన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖను ఆదేశించారు. నీరు కలుషితం కాకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. పల్లెకు పోదాం కార్యక్రమానికి అధికారులు సిద్ధంగా ఉండాలని, త్వరలోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వివరించారు. జేసీ డాక్టర్ బి.నవ్య, టెలీ కాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్‌డీఓలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్, డీపీఎం అనుపమ, జలవనరుల శాఖ ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్‌ఈ నాగేశ్వరరావు, డీపీఓ భాస్కర్ పాల్గొన్నారు.

విద్యాబోధనలో సాంకేతిక నైపుణ్యం జోడించాలి

సాంకేతిక నైపుణ్యంతో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా విద్యాశాఖాధికారులను ఆదేశించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంలో భాగంగా విద్యలో ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సలహాలు, సూచనలు ఇవ్వడం కోసం వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యలో సాంకేతిక నైపుణ్యం ప్రాధాన్యతను వివరించారు. పీఎంశ్రీ పాఠశాలల నిర్మాణంలో సమస్యలు పరిష్కరించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా రూ.10 లక్షల్లోపు ఎస్టిమేట్‌లు ఉంటే నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. డీఈఓ శామ్యూల్‌పాల్, సమగ్ర సెక్టోరియల్ ఆఫీసర్లు వై.ధనరాజు, మల్లయ్య, సురేంద్ర బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు

ప్రతి మండలం కేంద్రంలో కోల్డ్ స్టోరేజీ కేంద్రాన్ని నిర్మించనున్న నేపథ్యంలో రెండెకరాల భూమిని గుర్తించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఇందుకు తహసీల్దార్ల సాయం తీసుకోవాలని జిల్లా సహకార శాఖ అధికారి వెంకట కృష్ణను ఆదేశించారు. అలాగే పీఎం జన ఔషధి కేంద్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో జన ఔషధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. పీఏసీ కేంద్రాల్లో యూరియా విక్రయాలపై నిఘా ఉంచాలని, ఎక్కడైనా బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, ఎక్కువ రేట్లకు అమ్మినా నివేదికలు ఇవ్వాలన్నారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియాను కచ్చితంగా అందుబాటులో ఉంచాలని డీఏఓ పీఎల్ వరలక్ష్మిని ఆదేశించారు.

15న 'స్త్రీ శక్తి' ప్రారంభోత్సవాలు

కర్నూలు (సెంట్రల్): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ఆగస్టు 15న స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని, ఈ సందర్భంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆర్టీసీ అధికారులు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించారు. ఆ మేరకు ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీనివాసులు, సబ్ కలెక్టర్, ఆర్‌డీఓలు, ఇతర నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

21న మహిళల రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 21న ఖేలో ఇండియా మహిళల రగ్బీ పోటీలు నిర్వహించనున్నట్లు రగ్బీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, గుడిపల్లె సురేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, రగ్బీ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో అండర్-15 విభాగంలో బాలికలకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 93088 27585 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రెగ్యులర్ వీసీని నియమించాలి

కర్నూలు(సెంట్రల్): క్లస్టర్ యూనివర్సిటీకి రెగ్యులర్ వైస్‌చాన్స్‌లర్‌ను నియమించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప విమర్శించారు. బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సిల్వర్ జూబ్లీ, కేవీఆర్, ఫర్ మెన్ డిగ్రీ కళాశాలలకు అనుబంధంగా క్లస్టర్ యూనివర్సిటీ యాక్ట్-2020 ప్రకారం వీసీ, రిజిస్ట్రార్ పోస్టులు తప్ప ఏ ఒక్క పోస్టును భర్తీ చేయలేదన్నారు. జగన్నాథగట్టుపై నిర్మిస్తున్న భవనాలు అసంపూర్తిగానే మిగిలాయని, వాటిని పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. తక్షణమే భవనాలను పూర్తి చేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేసి సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను అందుబాటులోకి తేవాలని కోరారు. క్లస్టర్ వర్సిటీని మూసివేస్తున్నారని వస్తున్న వార్తలపై విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించాలని, లేనిపక్షంలో పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అమర్, యోగి, మనోహర్, చిన్న పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో భవిష్యత్తు అంధకారం


మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు: గంజాయి, డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జీవితం నాశనమవుతుందని, వాటికి దూరంగా ఉంటూ విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కర్నూలు ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి సూచించారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో టౌన్ మోడల్ జూనియర్ కళాశాల, ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, మనిషి ఆరోగ్యంపై చూపే దుష్ప్రభావాలను వివరించారు. డ్రగ్స్‌కు బానిసలైన వారు తారసపడితే సమాచారం అందించాలన్నారు. విద్యార్థుల చేత డ్రగ్స్‌కు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, జిల్లా అధికారులు సుధీర్ బాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుద్ద వాగుకు రక్షణ గోడ నిర్మించాలి


గణేష్ నగర్‌లో పొంగి ప్రవహిస్తున్న సుద్దవాగును చూపిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కర్నూలు నగరంలోని 22, 23, 24వ వార్డుల పరిధిలో ఉన్న సుద్దవాగుకు రక్షణ గోడ నిర్మించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు శ్రీరామ్‌నగర్, లక్ష్మీనగర్‌లలో పర్యటించారు. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా సుద్ద వాగు పొంగిపొర్లి ఆ కాలనీలు జలమయమయ్యాయన్నారు. నరసింహులు మాట్లాడుతూ వాగుకు రక్షణ గోడ లేకపోవడంతో గణేష్ నగర్ నుంచి కేసీ కెనాల్ వెంట వెళ్లే వాహనాదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాగు పొంగిన ప్రతిసారి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, విధులకు వెళ్లే ఉద్యోగులు సుద్ద వాగును దాటేందుకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లవసిన పరిస్థితి ఉందన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి రాజకీయ నాయకులు మేము గెలిస్తే సుద్ద వాగుకు రక్షణ గోడను నిర్మిస్తామని హామీలు గుప్పిస్తున్నారు తప్ప గోడ నిర్మించడం లేదన్నారు. కార్యక్రమంలో అజ్మిత్, శేఖర్, రాజు, అయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పెళ్లి బృందానికి గాయాలు

కల్లూరు: 44 జాతీయ రహదారి పెద్దటేకూరు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెళ్లిబృందానికి గాయ్యాలయ్యాయి. చిన్నటేకూరు గ్రామానికి చెందిన పెళ్లి బృందం (వధువు తరపువారు) పెద్దటేకూరులో వరుడి ఇంటి వద్ద జరిగే వివాహ కార్యక్రమానికి ట్రాక్టర్‌లో బయలు దేరారు. పెద్దటేకూరు దగ్గర సర్వీసు రోడ్డులో వెళ్లాల్సి ఉండగా.. మరిచిపోయి బ్రిడ్జిపై ముందుకెళ్లి రివర్స్ వచ్చి సర్వీస్ రోడ్డులో పోవడానికి ప్రయత్నిస్తుండగా పెళ్లి బృందం ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న 12 మంది స్వల్ప గాయాలకు గురికాగా, ముగ్గురికి తీవ్రగాయ్యాలయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే నేషనల్ హైవే పెట్రోలింగ్ వాహనంలో హెడ్ కానిస్టేబుల్ నూర్ అహమ్మద్, మొబైల్ సిబ్బంది గాయపడిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదే సమయంలో చిన్నటేకూరు క్యాంపస్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న అశోకా మహిళ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అశోక్‌వర్ధన్ రెడ్డి, చిన్నటేకూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గాయపడిన వారిని తన కార్లలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వాతంత్య్ర యోధుల చిత్ర ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: స్వాతంత్య్ర సమరయోధుల వీర గాథలు భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ప్రముఖ న్యూరో సైక్రియాట్రిస్ట్ డాక్టర్ కంచర్ల హరిప్రసాద్ అన్నారు. బుధవారం పాతబస్తీలోని గడ్డ వీధి షంషియా మదరసాలో ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్ సేకరించిన ముస్లిం స్వాతంత్య్ర సమరయోధుల చిత్రాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో ముస్లిం నేతలు ప్రాణాలు తెగించి పోరాడారన్నారు. టిప్పు సుల్తాన్ మొదలుకొని గులాం రసూల్ ఖాన్ వరకు వేలాది మంది ముస్లింలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి అమరులయ్యారని వివరించారు. షంషియ మదరసా మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు షేక్ మౌలానా అబ్దుల్ జబ్బార్ మాట్లాడుతూ.. స్థానిక చరిత్ర పరిశోధకుడు నశీర్ అహ్మద్ దేశమంతా తిరిగి ముస్లిం స్వాతంత్య్ర సమరయోధుల చరిత్రను సేకరించి చరితార్థులు అనే గ్రంథాన్ని రచించారన్నారు. ఆ గ్రంథాల నుంచి గ్రహించిన 154 మంది ముస్లిం మహిళ, పురుష స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలతో ప్రదర్శను ఏర్పాటు చేశామన్నారు. ప్రముఖ కథా రచయిత ఇనాయతుల్లా, నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ మాట్లాడారు. కమిటీ కార్యదర్శి ఖదీరుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడి.. ప్రమాదకరంగా!


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పెచ్చులూడిన పైకప్పు

కర్నూలు కల్చరల్: ఈ చిత్రాలు కర్నూలు నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలోనివి. గ్రంథాలయంలో బుక్ సెక్షన్ పైకప్పు పెచ్చులు ఊడి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెమ్మ చేరి నీరు కారుతూ పాఠకులకు ఇబ్బందికరంగా మారింది. నీరు కారే చోటు నుంచి బుక్స్ రాక్స్‌ను పక్కకు జరిపి వాటిపై నీరు పడకుండా ఫ్లెక్సీలను కప్పి ఉంచారు. లైబ్రేరియన్ కూర్చునే దగ్గర నీరు కారుతుండంతో అక్కడున్న కంప్యూటర్, ప్రింటర్‌ను పక్కకు జరిపి ఉంచారు. విద్యార్థులు, పాఠకులు బిక్కుబిక్కుమంటూ పెచ్చులూడిన చోటనే కూర్చొని చదువుకుంటున్నారు. అధికారులు స్పందించి గ్రంథాలయం పైకప్పును బాగు చేయించాలని కోరుతున్నారు.


పైకప్పు దెబ్బతిని వర్షపు నీరు కారుతున్న దృశ్యం

హర్ ఘర్ తిరంగా ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్జేడీ సురేష్‌బాబు, తదితరులు

కర్నూలు సిటీ: స్థానిక బిక్యాంపులోని ప్రభుత్వ ఒకేషనల్ కాలేజీలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఇంటర్మీడియెట్ ఆర్జేడీ సురేష్‌బాబు, సెట్కూరు సీఈఓ డాక్టర్ కె.వేణుగోపాల్, ఏపీఎస్‌పీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఆర్ఐఓ జి.లాలెప్ప ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దేశభక్తి గీతాలు, నినాదాలు చేస్తూ బీ క్యాంపు నుంచి సీ క్యాంపు, బిర్లా సర్కిల్ మీదుగా కాలేజీ వరకు ర్యాలీ చేపట్టారు. ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీని ప్రారంభించి పాల్గొన్న ఎంపీ నాగరాజు, జేసీ డాక్టర్ బి.న్య,


జాతీయతను చాటుతూ బైక్ ర్యాలీలో పాల్గొన్న అధికారులు

తిరంగా బైక్ ర్యాలీ

ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతి సంవత్సరం స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పౌరులు జాతీయ పతకాన్ని గౌరవించే విధంగా కేంద్ర ప్రభుత్వం హర్ ఘర్ తిరంగాకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా ప్రతి పౌరుడు తన ఇళ్లు, తాను పనిచేసే కార్యాలయాలు, ప్రదేశాల సమీపంలో జాతీయ జెండాలను ఎగురవేసుకోవాలని సూచించింది. ఈక్రమంలో ప్రజలకు అవగాహన కోసం అధికార యంత్రాంగం వారం రోజులుగా హర్ హర్ తిరంగా కార్యక్రమాన్ని చేపడుతోంది. బుధవారం తిరంగా బైక్ ర్యాలీకి శ్రీకారంచుట్టింది. సెట్కూరు శాఖ సీఈఓ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తిరంగా ర్యాలీని కలెక్టరేట్ వద్ద కర్నూలు ఎంపీ నాగరాజు, జేసీ డాక్టర్ బి.నవ్య ప్రారంభించగా..కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ ఏర్పాటు చేసిన తిరంగా సెల్ఫీ పాయింట్ అధికారులు సెల్ఫీలు తీసుకొని తిరంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. - కర్నూలు(సెంట్రల్)

నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(రూరల్): తుంగభద్ర నదికి భారీగా నీరు విడుదలవుతున్న క్రమంలో నదీతీరంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్ బాబు సుచింరాచు. నదికి దాదాపు 60 వేల క్యూసెకుల నీరు వస్తోందని ప్రజలు నది వైపు వెళ్లారాదని, చేపల వేటకు, బట్టలు శుభ్రపరిచేందుకు, స్నానాలు కోసం నదిలోకి దిగరాదని గ్రామాల్లో దండోరా వేయించారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

కర్నూలు(రూరల్): మండల పరిధి గొందిపర్ల గ్రామంలో చిప్పరౌస్ ప్రభుత్వ స్థలంలో కొట్టాలు వేసుకున్న పేదలకు ఇంటి పట్టాలు అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలోని చిప్పరౌస్ ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 106లో కొట్టాలు వేసుకొని జీవనం సాగిస్తున్న కుటుంబాలను సీపీఎం నాయకులు పరిశీలించారు.

ఆకతాయిలపై డ్రోన్ నిఘా


కళాశాల వద్ద డ్రోన్ కెమెరాతో నిఘా చిత్రం

కర్నూలు: విద్యాసంస్థల వద్ద ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడే ఆకతాయిలపై నిఘా కోసం పోలీసులు డ్రోన్ సేవలను వినియోగంలోకి తెచ్చారు. విద్యార్థుల్లో భద్రత భావం పెంచేందుకు డ్రోన్, శక్తి టీమ్ సభ్యులతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బుధవారం కర్నూలు శివారులోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల, ఆర్ఎస్ రోడ్డులో ఉన్న కేవీఆర్ కళాశాల, మౌర్యా ఇన్ వద్ద ఉన్న చైతన్య కళాశాల, రాజ్‌విహార్ సర్కిల్ దగ్గర ఉన్న నారాయణ కళాశాలల సమీపంలో ఆకతాయిల ఆట కట్టించేందుకు డ్రోన్ కెమెరాతో శక్తి టీమ్ పోలీసులు నిఘాను పటిష్టం చేశారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాను వినియోగించి ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యాలయాల వద్ద ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి సంఘటనలను నివారించేందుకు డ్రోన్ సేవలను వినియోగిస్తున్నట్లు మహిళా పీఎస్ సీఐ విజయలక్ష్మి తెలిపారు. డ్రోన్ పర్యవేక్షణతో పాటు విద్యాలయాల వద్ద పోలీసు బృందాలు కూడా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయన్నారు. ప్రతిరోజూ జిల్లా వ్యాప్తంగా 36 ఈవ్ టీజింగ్ బీట్స్ విద్యాలయాల వద్ద విధులు నిర్వహిస్తున్నాయని చెప్పారు. జులై 1 నుంచి ఈ నెల 12వ తేదీ వరకు ఈవ్ టీజింగ్‌కు పాల్పడేవారిపై నిఘా ఉంచి 10,967 మందికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

అనధికార లేఔట్లను క్రమబద్ధీకరించుకోండి


మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు (టౌన్): అనధికార లేఔట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య సూచించారు. బుధవారం స్థానిక నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో ఎల్ఆర్ఎస్ పథకంపై లైసెన్స్‌డ్ ఇంజినీర్లతో కలిసి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. అనధికారిక లేఔట్ల క్రమబద్ధీకరణ పథకంలో కొన్ని సవరణలు చేస్తూ ప్రభుత్వం జీఓ నంబర్ 134 జారీ చేసిందన్నారు. ఈ ఏడాది జూన్‌కు ముందు ఏర్పాటైన అనధికార లేఔట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందన్నారు. వచ్చే అక్టోబర్ 24వ తేదీలోపు రూ.10 వేలు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది తనిఖీ చేసి ధ్రువీకరించిన తరువాత మార్కెట్ విలువలో 14 శాతం అపరాధ రుసుం చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. 45 రోజుల్లోపు పూర్తి రుసుం చెల్లించిన వారికి 10 శాతం రాయితీ, 45 నుంచి 90 రోజుల వ్యవధిలో చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. గడువులోపు క్రమబద్ధీకరించుకోని అనధికారిక లేఔట్లు, ప్లాట్లకుక విద్యుత్ సౌకర్యం, నీటి సరఫరా, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఆర్‌డీటీటీపీ సంజీవ్‌కుమార్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి


పి.రమేష్‌బాబును సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు (సెంట్రల్): కర్నూలు జిల్లాలో ఆంధ్రప్రదేశ్ కేంద్ర ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం బలోపేతానికి చర్యలు తీసుకోవాలని ఆ సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షుడు పి.రమేష్ బాబు సూచించారు. బుధవారం కర్నూలుకు వచ్చిన సందర్భంగా ఆయన్ను సంఘం జిల్లా అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, ఇతర నేతలు కలిసి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం జిల్లా కమిటీ తరపున ఆయన్ను సన్మానించారు.

వ్యవసాయ కార్పొరేటీకరణపై ఉద్యమం


నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): వ్యవసాయ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు ప్రజా సంఘాలు పేర్కొన్నాయి. కేంద్ర ప్రభుత్వం అమెరికా, బ్రిటన్లతో చేసుకున్న రైతు వ్యతిరేక ఒప్పందాలను రద్దు చేయాలని కోరుతూ బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ట్రాక్టరు, స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, ఆయా సంఘాల నాయకులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ ఆనంద్‌బాబు, గురుశేఖర్, రాఘవేంద్ర మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ వ్యవసాయాన్ని పండుగ చేస్తానని చెప్పి దండగ చేస్తున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో విఫలమయ్యారని, మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ సర్కార్ రైతులపై కర్కశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

15న మాంసం విక్రయాల నిషేధం

కర్నూలు (టౌన్): ఈ నెల 15న స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకొని నగరపాలక సంస్థ పరిధిలో మాంసం విక్రయాలు నిషేధించినట్లు నగరపాలక ప్రజారోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున జంతువులను వధించరాదని, హోటల్స్, రెస్టారెంట్లలో మాంసం అమ్మరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.